ప్రజాశక్తి

గురువారం 4 మే 2023

చంద్రబాబు పర్యటన వాయిదా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్.చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన వాయిదా పడింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల పదో తేదీన జిల్లాకు రావాల్సి ఉంది. తిరుపతి జిల్లాలో ఈనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు పర్యటించాల్సి ఉండగా వర్షాల కారణంగా వాయిదా పడింది. ఆ తేదీలకు బదులుగా ఈనెల పదో తేదీ నుంచి మూడు రోజుల పాటు అక్కడ పర్యటించాలని నిర్ణయించారు. దీంతో అనివార్యంగా జిల్లా పర్యటన వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈనెల 17న జిల్లా మహానాడు, ఆ తర్వాత 27న రాష్ట్ర మహానాడు నిర్వహించనుండడంతో ఆ తర్వాతే జిల్లా పర్యటన ఉండవచ్చని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నిరసనలపై 'ఉక్కు'పాదం

- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై రాస్తారోకో
- భగ్నం చేసిన పోలీసులు
- జిల్లావ్యాప్తంగా వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ చేపట్టిన నిరసనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పోలీసులను ఉపయోగించి అరెస్టులు, గృహ నిర్బంధాలతో అణచివేసింది. ఉక్కు పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం రాస్తారోకో చేపడతారన్న సమాచారంతో జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లలో పెట్టారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారోకోకు సిద్ధమవుతున్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో నాయకులు వాగ్వాదానికి దిగారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలు నశించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సిపిఐ నాయకులు కె.భాస్కరరావు, నగర కార్యదర్శి టి.తిరుపతిరావు తదితరులను అరెస్టు చేసి శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

శ్రీకాకుళం నగరంలో...

సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, శ్రామిక మహిళా కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణిని తిలక్‌నగర్‌లోని వారి ఇంటి వద్ద గృహ నిర్బంధం నిర్బంధం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు నాయకులు కె.సూరయ్య, ఎన్.గణపతి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తిని అరెస్టు చేసి శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. సిఐటియు నాయకులు అల్లు మహాలక్ష్మిని ఆమె నివాసంలో నిర్బంధించారు.

శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వామపక్షాల నాయకులు

టెక్కలిలో...

టెక్కలిలో సిఐటియు, ఎఐటియుసి, విద్యార్థి, యువజన, దళిత సంఘాల నాయకులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొల్లి ఎల్లయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల పోలారావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, విద్యార్థి, యువజన సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుదేవ్ బెహరా ఉన్నారు.

పలాసలో...

రాస్తారోకో చేపట్టడానికి అనుమతులు లేవంటూ పోలీసులు వామపక్ష నాయకులకు ఈనెల రెండో తేదీన నోటీసులు ఇవ్వడంతో పాటు కొంతమందిని ముందుస్తు అరెస్టు చేసి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వామపక్షాల నాయకులు ఎన్.గణపతి, చాపర వెంకటరమణ, ఎం.రామారావు, సిహెచ్.వేణుగోపాల్, వంకల మాధవరావును మధ్యాహ్నం 12 గంటల సమయంలో సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వజ్రపుకొత్తూరులో...

వజ్రపుకొత్తూరులో సిపిఎం నాయకులు బి.ఆనందరావు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

కంచిలిలో...

కంచిలి మండలం బూరగాంలో సిఐటియు నాయకుడు లోకనాథం, కప్ప గోపీనాథ్‌ను గృహ నిర్బంధం చేశారు.

టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సోంపేటలో...

సోంపేట మండలం బారువలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, సిఐటియు నాయకులు భాస్కర్‌ను అరెస్టు చేసి అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

కొత్తూరులో...

కొత్తూరులో రాస్తారోకోకు బయలుదేరేందుకు సిద్ధమైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్నను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రణస్థలంలో...

భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి యునైటెడ్ బ్రేవరీస్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తారన్న సమాచారంతో జె.ఆర్ పురం పోలీసులు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడును పైడిభీమవరంలో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజులనూ అదే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరకంగా పోరాడుతున్న వారిని ప్రభుత్వ అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలను మంగళవారం రాత్రి నుంచి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదానీకి అప్పగించేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు నిర్మాణం కోసం రూ.5,490 కోట్లు ఇస్తే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.50 వేల కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిందని చెప్పారు. కరోనా కాలంలో బిజెపి ప్రభుత్వం ఆక్సిజన్ దేశవ్యాప్తంగా అందజేయలేక చేతులెత్తేస్తే, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ దేశవ్యాప్తంగా లిక్విడ్ ఆక్సిజన్‌ను ప్రజలకు అందించిందని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తున్నా బిజెపి ప్రభుత్వాన్ని వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఐక్య ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- స్టోన్ ప్లాంటేషన్, ఇకెవైసి వేగవంతం చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనుల్లో భాగంగా స్టోన్ ప్లాంటేషన్, ఇకెవైసి వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే, ఇకెవైసి పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యానికి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడమే కారణమన్నారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో నెలలు గడుస్తున్నా స్టోన్ ప్లాంటేషన్ ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. త్వరగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రణస్థలం మండలంలో రీ సర్వే సక్రమంగా చేపట్టడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై వివరణ ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. సమస్యలున్న ప్రాంతాల్లో సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనుల్లో కొంత జాప్యం ఉన్నా, సమస్యలు ఉత్పన్నం కాకుండా తహశీల్దార్లు చూడాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం గతంలో వేగంగా సాగిందని, ఇటీవల కొంత ఆలస్యమవుతోందన్నారు. వర్షాకాలం మొదలైతే పంట పొలాల్లో స్టోన్ ప్లాంటేషన్ కష్టమవుతుందని గుర్తుచేశారు. రానున్న 40 రోజులు కీలకంగా భావించి పనుల్లో వేగం పెంచాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించలేమన్నారు. స్టోన్ ప్లాంటేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పనుల నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గరాదన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 3,33,649 స్టోన్ ప్లాంటేషన్ చేసినట్లు వివరించారు. ఇంకా లక్ష చేయాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్లాంటేషన్ పనులను ఈనెల 18వ తేదీ నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్టోన్స్ అందని గ్రామాల వివరాలు తెలియజేస్తే పంపిస్తామన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, తహశీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని 12 ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పెన్షన్ తీసుకుంటున్న పింఛనుదారులు సిఎఫ్‌ఎంఎస్ ఐడి నంబరుతో ఆధార్ నంబరును ఇకెవైసి చేయించాలని జిల్లా ఖజానాశాఖ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 35 శాతం మంది పెన్షనర్లు మాత్రమే ఇకెవైసిలో నమోదై ఉన్నారని, మిగిలిన వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. పెన్షన్ పొందడానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు వీలుగా లింక్ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. హెర్బ్ యాప్ ద్వారా గానీ పెన్షన్ పొందుతున్న ఉప ఖజానా కార్యాలయంలో గానీ ఈనెల ఆరో తేదీ లోగా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, ఆధార్‌కు నమోదైన ఫోన్, సిఎఫ్‌ఎంఎస్ ఐడి, పిపిఒ కాపీ, బ్యాంకు పాస్‌బుక్ తీసుకెళ్లాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

లోక్ అదాలత్‌తో కేసుల శాశ్వత పరిష్కారం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహన ప్రమాద కేసులు ఎక్కువగా రాజీ చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా కోర్టులో గల జిల్లా జడ్జి ఛాంబరులో శ్రీకాకుళం, పార్వతీపురం ఎస్‌పిలు జి.ఆర్ రాధిక, విక్రాంత్ పాటిల్‌తో బుధవారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్ ద్వారా అత్యధిక క్రిమినల్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, ఇన్సూరెన్సు కేసుల పరిష్కారానికి క్షేత్రస్థాయి అధికారులకు ఇవ్వాలని సూచించారు. అనంతరం జిల్లాలోని పలు ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు స్టాండింగ్ కౌన్సిల్, అదనపు జిల్లా జడ్జిలు, ప్రభుత్వ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ కావడానికి బాధ్యత తీసుకుని పరిష్కరించాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అయిన కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ఫ్యామిలీ కోర్టు అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు అదనపు జిల్లా జడ్జి పనికుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, ప్రభుత్వ న్యాయవాది వినయ్ భూషణరావు, ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ లక్ష్మి, మంచు జనార్ధనరావు, ఇన్సూరెన్స్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాలపై నమ్మకం కలిగించాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వసతిగృహాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహ అధికారులతో జాతీయ ఆహార భద్రత చట్టంపై బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వసతిగృహాల్లో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాల నిర్వహణ బాధ్యతను పూర్తిగా వార్డెన్లదేనని స్పష్టం చేశారు. పిల్లలకు మంచి భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించాలన్నారు. వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. జూన్ మూడో తేదీ నాటికి వసతిగృహాల వాటర్ ట్యాంకులు పూర్తిస్థాయిలో శుభ్రపరచి ఫొటోలతో సహా నివేదికలు సమర్పించాలన్నారు. మెనూను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఇంటర్ ఫలితాలపై వసతిగృహాల వారీగా సమీక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన టెక్కలి, పొందూరు కళాశాల బాలికల వసతిగృహాల అధికారులను అభినందించారు. జిల్లాలో అన్ని వసతిగృహాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల చదువుపై ప్రత్యేక బాధ్యతతో శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ, ఎస్‌సి సంక్షేమ సాధికారత అధికారి ఆర్.గడ్డెమ్మ, శ్రీకాకుళం, పలాస సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతిగృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అక్రిడిటేషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

2023-24 కాలపరిమితికి గానూ అక్రిడిటేషన్లకు జిల్లాలోని పాత్రికేయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిఒ నంబరు 38లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన పత్రికలు, ఛానళ్లు, న్యూస్ ఏజెన్సీలకు చెందిన ప్రతినిధులు ఈనెల మూడో తేదీ నుంచి 15వ తేదీలోగా www.ipr.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల సిఫార్సు లేఖ, అవసరమైన డాక్యుమెంట్లు పిడిఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, దరఖాస్తుదారు సంతకం కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చేయాలని తెలిపారు. అప్లికేషన్ ప్రింట్‌తో పాటు అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయానికి ఈనెల 16వ తేదీ లోగా అందజేయాలని స్పష్టం చేశారు.

పత్రికలు, ఛానళ్ల పేర్లు వెబ్‌సైట్‌లో యాడ్ చేయించుకునేందుకు ఛానల్ సంస్థలైతే తాజా వార్షిక పన్ను చెల్లింపు పత్రాలు, ఐబి లైసెన్స్, పత్రికలైతే ఆర్‌ఎన్‌ఐ సర్టిఫికేట్, తాజా వార్షిక పన్ను చెల్లింపు కాపీ, పేజీల సంఖ్య, సర్క్యులేషన్ వివరాలతో కూడిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కేబుల్ టివిలకు సంబంధించి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ సమర్పించాలని పేర్కొన్నారు.

కుప్పకూలిన బాహుదా వంతెన

వార్త... మెయిన్ పేజీలో

క్రీడారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్రీడారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని సెట్‌శ్రీ సిఇఒ, జిల్లా క్రీడాభివృద్ధి ప్రధాన అధికారి బి.వి ప్రసాదరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నెల రోజుల పాటు నిర్వహిస్తున్న తైక్వాండో, ఉషూ వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన పెద్దఎత్తున వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 50 శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.

శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న సెట్‌శ్రీ సిఇఒ తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉన్నత విద్యలో క్రీడారంగం కోటా కింద విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. పిల్లలు విద్యతో పాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వేసవి శిక్షణా శిబిరాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మంజూరు చేసిన 50 శిబిరాలు చాలవని, కలెక్టర్ చొరవ తీసుకుని మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.భాస్కరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, ఎం.నళినీ సుధాకర్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక ప్యాకేజీ

ఎస్‌సి, ఎస్‌టిల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్‌ఆర్ జగనన్న బడుగు వికాసం స్పెషల్ ప్యాకేజీ కింద పరిశ్రమలు స్థాపించాలనుకునే ఆసక్తి గల ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమలతో పాటు సేవారంగంలో ఆసక్తి గల అభ్యర్థులూ సంప్రదించవచ్చని తెలిపారు. ఈ పాలసీ ద్వారా స్థిర పెట్టుబడుల్లో రూ.1.20 కోట్లకు మించకుండా 45 శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. రూ.50 లక్షలకు మించకుండా ఐదేళ్ల వరకు 9 శాతం వడ్డీ రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. సేల్స్ టాక్స్‌లో ఎస్‌జిఎస్‌టి నుంచి శత శాతం ఐదేళ్ల వరకు తిరిగి చెల్లింపు ఉంటుందని తెలిపారు. భూమి ధరలో రూ.20 లక్షలకు మించకుండా 50 శాతం రాయితీని, స్టాంప్ డ్యూటీ కింద శతశాతం తిరిగి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

వీటితోపాటు ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల్లో రూ.10 లక్షలకు మించకుండా 25 శాతం రాయితీ, కరెంట్ ఛార్జీల్లో యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఐదేళ్ల వరకు తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ కోసం రూ.25 లక్షలకు మించకుండా 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్లు, టిప్పర్లు, బస్సులు తదితర రవాణా వాహనాల స్థిర పెట్టుబడిలో రూ.75 లక్షల వరకు రాయితీ (45 శాతం) ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌ని సంప్రదించి ప్రభుత్వం కల్పిస్తున్న సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనధికార కళాశాలలపై చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, జి.సిగడాం

అనధికార, గుర్తింపు లేని ఇంటర్మీడియట్ కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆర్‌ఐఒ తవిటినాయుడు అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాంతో కలిసి నగరంలోని న్యూ కాలనీలో గల పలు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.

అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని నిద్దాం సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో సచివాలయ కార్యాలయం నిర్వహించడం, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, సిబ్బంది రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ బాలలు హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమల్లో లోపాల్లేకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రామకఖృష్ణ, విఆర్‌ఒ వెంకటరమణ, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ ఉషారాణి, డిజిటల్ అసిస్టెంట్ ఎల్.శశిభూషణ్, సర్వేయర్ పి.చిరంజీవువులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎ.అశోక్, వెటర్నరీ అసిస్టెంట్ వండాన శారద, ఎఎన్‌ఎం పి.పద్మ, నాగూర్ భాష పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న అప్పారావు

నేడు అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా రామతీర్థాలు ఆలయ కార్యనిర్వహణాధికారి కిషోర్, ఆలయ పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

మరిన్ని వార్తల కోసం

epaper.prajasakti.com

వినతిపత్రం అందజేస్తున్న శ్రావణి

రోడ్ల నిర్మాణానికి డిఆర్‌ఎం అనుమతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూండీ రైల్వేస్టేషన్ పరిధిలో రెండు రోడ్ల నిర్మాణానికి వాల్తేర్ రైల్వే డివిజనల్ మేనేజర్ అనుమతి ఇచ్చినట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి తెలిపారు. విశాఖపట్నంలోని డిఆర్‌ఎం అనూప్ కుమార్ స్టపతిను వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావుతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా ఏళ్లుగా గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, శ్మశాన వాటికి రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రైల్వే శాఖపరంగా తమకు అనుమతులు మంజూరు చేయాలని డిఎంఆర్‌ను కోరారని తెలిపారు. ఈ పనులకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించినట్లు చెప్పారు. అలాగే పూండీ స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని కోరినట్లు ఆమె తెలిపారు. డిఆర్‌ఎం వెంటనే స్పందించి రోడ్ల నిర్మాణానికి రైల్వే శాఖ పరంగా అనుమతులు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు.

అవస్థలు పడుతున్న వాహనదారులు

నరసాపురంలో గ్రామదేవత పండగ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని నందివాడ పంచాయతీ నరసాపురఅగ్రహారంలో గ్రామ దేవత పండుగ అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ పండగలో పలు వేషధారణలతో పాటు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే గ్రామానికి బంధువులు, పరిసర గ్రామస్తులు పెద్దఎత్తున చేరుకోవడంతో గ్రామంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురవడంతో అవస్థలు మరింత ఎక్కువయ్యాయి.

నిలిచిన విద్యుత్ సరఫరా

గ్రామంలో పెద్ద ఎత్తున గ్రామ దేవత పండుగ జరగగా రెండు రోజులుగా విద్యుత్ నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ లేదని, దీనిపై విద్యుత్ అధికారులు ఎవరూ స్పందించలేదంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బంధువులు రావడంతో పాటు రాత్రి వేళ ఉక్క బోతతో చిన్నారులు అల్లాడిపోయారని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ వినియోగంపై తమకు సమాచారం అందించకుండా అనాధికారికంగా విద్యుత్‌ను పెద్దఎత్తున వినియోగించారని అన్నారు. లోడ్ పెరిగిపోయి వైర్లు కాలిపోయాయని, దీనివల్ల విద్యుత్‌ను పునరుద్ధరించడం వీలు కాలేదని తెలిపారు.

కళ్యాణ వైభోగ'మే'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మే, జూన్ నెలల్లో దాదాపు 24 రోజుల్లో శుభ ముహూర్తాలు ఉండడంతో ఊరూరా పెళ్లి సందళ్లు మొదలు కానున్నాయి. ఈ ఏడాది సంక్రాంతి తర్వాత జనవరి 19 నుంచి మార్చి 9 వరకు మొత్తం 18 శుభ ముహూర్తాలు వచ్చాయి. ఆతర్వాత మళ్లీ రెండు నెలల విరామం తర్వాత తాజాగా మే నెలలో 6, 8, 9, 10, 11, 15, 16, 20, 21, 22, 27, 29, 30 తేదీల్లోను, జూన్ నెలలో 1, 3, 5, 6, 7, 11, 12, 23, 24, 26, 27 తేదీల్లో శుభముహూర్తాలు ఉన్నాయి.

కళ్యాణ మండపాలకు రద్దీ

పెళ్లి బాజాలు మొదలు కావడంతో ఇప్పటికే కళ్యాణ వేదికలు ఆయా రోజుల్లో ముందస్తుగానే బుక్ చేసుకున్నారు. మే, జూన్ నెలల్లో దాదాపు 24 శుభముహూర్తాలు ఉండడంతో వేడుకలకు సిద్ధమవుతున్నారు. మరో వైపు వస్త్ర మార్కెట్లు, బంగారం కళకళలాడుతున్నాయి. వరున పెళ్లిళ్లు కావడంతో మార్కెట్‌లో పెళ్లి సందడి కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఇళ్ల వద్ద పెళ్లిళ్లు చేసుకోవడంతో షామియానాలకు, వంట వారికి డిమాండ్ పెరిగింది. ఈ సారి మూహూర్తాలు తప్పితే మళ్లీ విరామం వచ్చినట్టే. జూన్ చివరి వారంలో ఆషాఢ మాసం మొదలుకానుంది. దీంతో మళ్లీ శుభకార్యాలకు విరామం వస్తుంది. ఆషాఢ మాసం జూలై చివరి వరకు కొనసాగుతుంది. మే 11 నుంచి 24వ తేదీ వరకు అగ్నికార్తె ఉండటంతో ఆ సమయంలో వచ్చే ముహూర్తాలు, గృహప్రవేశాలకు అనుకూలించవు. జూన్ నెలాఖరు వరకు ముహూర్తాలున్నా... ఆషాఢం వస్తుంది. ఆ తర్వాత దాదాపు 2 నెలలు పెళ్లిళ్లు ఉండవు. అందుకే మే, జూన్ నెల మొదట్లోనే ఎక్కువ వివాహాలు జరగనున్నాయి.

ఆమదాలవలసలోని ఓ కళ్యాణ మండం

అభివృద్ధికి ప్రభుత్వ కార్యాలయాలు చిహ్నాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

పొందూరు: ప్రభుత్వ కార్యాలయాలు అభివృద్ధికి చిహ్నాలని, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రూ.1.20 కోట్లతో నిర్మించిన పొందూరు మండల పరిషత్ కార్యాలయం నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగానే సుజల స్రవంతి ద్వారా పోలవరం సాగునీరు అందించడం, భోగాపురంలో అతిపెద్ద 12వ విమానాశ్రయం ఏర్పాటుకు భూమి పూజ, తీర ప్రాంతాల్లో పోర్టుల నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ప్రతిపక్షాలు మోకాలడ్డుతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఇది సరైన విధానం కాదని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, ఇఇ గిరిధర్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైస్ ఎంపిపి వండాన శ్రీదేవి, వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పొందూరు సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు నీలాపు ప్రసాద్‌రెడ్డి, బి.రామారావులకు ఎంపిడిఒ జి.ఉమాసుందరి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నిధులు అక్రమ మళ్లింపుపై మంగళవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన 'ఫీల్డ్ అసిస్టెంట్ కే ఉపాధి' అన్న కథనానికి ఎంపిడిఒ మంగళవారం విచారణ చేసిన సంగతి తెలిసిందే. ఈ విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన అక్రమాలు వాస్తవాలను తేలింది. అంతేకాకుండా విచారణకు వచ్చిన అధికారులతో అసభ్య పదజాలంతో దురుసుగా ప్రవర్తించడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నివేదికను కలెక్టర్, డ్వామా పీడీ పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

శ్రీభరణి, జడ్జి

కోటబొమ్మాళి: ఈ నెల 13న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకుని విజయవంతం చేయాలని స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్, మండల న్యాయ సేవా సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి అన్నారు. స్థానిక జూనియర్ కోర్టులో బుధవారం మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, భార్యాభర్తల కేసులు, చిట్ ఫండ్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని అన్నారు. అందువల్ల న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 5న కోటబొమ్మాళి కోర్టు వద్ద ముందస్తు లోక్ అదాలత్ (ప్రీలోక్ అదాలత్)ను నిర్వహిస్తామని, తద్వారా ముందుగా గుర్తించిన కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈనెల 8 నుంచి రోజూ ముందస్తు లోక్ అదాలత్ (ప్రీ లోక్ అదాలత్)ను నిర్వహిస్తామని అన్నారు. సివిల్ కేసుల్లో లోక్ అదాలత్‌లో రాజీ పడినా కోర్టు ఫీజు వాపసు ఇవ్వబడును అని తెలిపారు.

గిరిజనులకు అన్యాయం చేయొద్దు

దీక్ష చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి గిరిజనులకు అన్యాయం చేయొద్దని సంక్షేమ పరిషత్ గౌరవ సలహాదారు సవర ఏబేరు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. మార్చి 24 బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేస్తూ చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కలెక్టరేట్ సమీపంలో ఉన్న జ్యోతిరావుపూలే పార్కు మైదానంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ చేపట్టిన నిరసన దీక్ష బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికీ అట్టడుగున ఉన్న గిరిజన ఆదివాసీల జీవనస్థితిపై శ్యామ్యూల్ ఆనంద్ కమిషన్ ఇచ్చిన నివేదికలు వాస్తవ విరుద్ధమైనవని అన్నారు. గతంలో ప్రభుత్వం నియమించిన జెసి శర్మ కమిషన్ నివేదికలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ప్రభుత్వం కక్ష గట్టి ఆదివాసీ మనుగడను ప్రశ్నార్థంగా చేస్తోందని విమర్శించారు. ఏకపక్ష ధోరణితో తీసుకున్న తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భైరి కూర్మారావు, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్ట చంద్రపతి, కెఎన్‌పిఎస్ నాయకులు మిస్క కృష్ణయ్య, నేతల అప్పారావు, డాక్టర్ కంఠ వేణు, శ్రీను పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మృతి చెందిన రమణ

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కోటబొమ్మాళి : మండలంలోని జర్జంగ్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలం కలివరపుపేటకు చెందిన వారాడ రమణ (26) మృతి చెందగా, ఇప్పిలి రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వారిద్దరూ లగేజ్ ఆటోతో నరసన్నపేట నుంచి వ్యాపార రీత్యా టెక్కలి వైపు వెళు తున్నారు. వర్షం భారీగా కురవడంతో రోడ్డు మార్గం సక్రమంగా కనిపించలేదు. దీంతో వెనక్కి వెళ్లిపోదామని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జర్జంగ్ వద్ద ఒక్కసారిగా మలుపు తిప్పుతుండగా... పలాస నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో రమణ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు రమణకు మూడు నెలల క్రితమే వివాహమైందని బంధువులు తెలిపారు. ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

లావేరు : మండలంలోని బుడుమూరు కూడలి సమీపంలో తెల్లవారి జామున అనుమానాస్పద స్థితిలో గాయాలతో రోడ్డుపై ఉన్న యువకుడిని గుర్తించిన హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని 108 వాహనంలో జిల్లా సర్వజనాస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడిది విశాఖపట్నం జిల్లా మధురవాడ ప్రాంతంలోని స్వతంత్రనగర్ కాలనీకి చెందిన గేదెల భరత్ (27)గా గుర్తించారు. భరత్ తన స్నేహితులతో మంగళవారం రోజాంతా గడిపి రాత్రి 12 గంటల సమయంలో విశాఖ నుంచి కారులో శ్రీకాకుళం పట్నంలోని రెల్లివీధిలో ఉంటున్న తన ఇద్దరు స్నేహితులతో కలిసి వచ్చాడు. నేను విశాఖ వెళ్లిపోతానంటే బుధవారం వేకవజామున 3.30 గంటల సమయంలో నవభారత్ కూడలి వద్ద భరత్‌ను ఓ ప్రయివేటు బస్సు ఎక్కించినట్లు వెంకటేష్, శివలు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. ఇంతలోనే బుడుమూరు కూడలి సమీపంలోని రహదారిపై భరత్ పడి ఉన్నట్లులు హైవే పోలీసులు గుర్తించారు. ఘటన స్థలంలో వాహనం డోరు, మరికొన్ని ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతిని భార్య కామాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసిట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎస్ఐ రామారావు తెలిపారు. ఘటన స్థలాన్ని సిఐ ఆదాం పరిశీలించారు.

ఆటో ఢీకొని మహిళ..

సావిత్రి

జలుమూరు: మండలంలోని టెక్కలిపాడు కూడలి సమీపంలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమడాంకు చెందిన కింజరాపు సావిత్రి (36) మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. నరసన్నపేట మండలంలోని జమ్ములో జరుగుతు న్న సంబరాలకు బుధవారం ఉదయం స్కూటీపై వెళ్లింది. తిరిగి స్వగ్రామం తిమడాం స్కూటీపై వస్తుండగా మండలంలోని టెక్కలిపాడు కూడలి సమీపంలో వెనుక నుంచి ఆటో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాతపడింది. మృతురాలికి భర్త సిమ్మన్న, పిల్లలు ప్రియానంద్, వెంకటసాయి ఉన్నారు. తల్లి మృతితో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తిమడాంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మద్యం సీసాలు స్వాధీనం

టెక్కలి రూరల్: మెళియాపుట్టి రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం సీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి పట్టుబడ్డాయని అన్నారు. కొల్లిపాడుకు చెందిన పట్నాన దిలీప్, పరిపటి వెంకటేష్, టెక్కలికి చెందిన ఉర్లాన ప్రసాద్‌లు రెండు బైక్‌లపై పర్లాకిమిడి నుంచి సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ తరలించామన్నారు. బైక్‌ను సీజ్ చేసి వారిని అరెస్టు చేశామని తెలిపారు.

ఎంపిడిఒకు సతీవియోగం

పద్మావతి (ఫైల్)

పొందూరు: పొందూరు ఎంపిడిఒ, బూర్జ ఇఒపిఆర్‌డి, టెక్కలి డివిజన్ డిఎల్‌పిఒ సీపాన హరిహరరావు సతీమణి పద్మావతి అనారోగ్యంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్సను అందిస్తుండగా... పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. స్వగ్రామం తోలాపిలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈమె మృతికి ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైస్ ఎంపిపిలు వండాన శ్రీదేవి, కాకర్ల చెల్లమాంబ, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, తహశీల్దార్ రాంబాబు, ఎపిఎం శ్యామలరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎంపిటిసిలు కూన ప్రమీల, బాడాన హారిక, కిల్లాన సూర్యారావు, తోలాపి సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ, ఎంపిటిసి మాజీ సభ్యులు పప్పల అప్పలనాయుడు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

'విజయలక్ష్మి ఆగ్రోస్' ప్రారంభం

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీలో విజయలక్ష్మి ఆగ్రోస్ షాప్‌ను సామాజికవేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం రైతులకు యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎద్దు దాసునాయుడు, మండల మాజీ జనరల్ ప్రధాన కార్యదర్శి ఆరుబోలు దశరథరావు, వి.వెంకటరమణ, కనపాకల ప్రసాదరావు, కర్రీ గోవిందరావు, బెవర బాలనాయుడు పాల్గొన్నారు.

యంత్రాలను అందజేస్తున్న గోవిందరావు

సార్ వచ్చారు... లారీలు ఆపేశారు

జాతీయ రహదారిపై నిలిచిన లారీలు

పలాస: విజయనగరం జిల్లా బోగాపురంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు బుధవారం వచ్చారు. దీంతో పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేట్ జాతీయ రహదారి వద్ద భారీగా లారీలను నిలిపి వేశారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర రెండు వైపులా లారీలు ఆగిపోయాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపనకు సిఎం వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా లారీలు నిలిపివేశామని పోలీసులు తెలిపారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా లారీలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. లారీడ్రైవర్లు వంట, వార్పు చేసుకుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిఎం విజయనగరం వస్తే... ఇక్కడ లారీలు ఆపివేయడం ఎంత వరకు సమంజసమని లారీడ్రైవర్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి- పలాస

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల, బంటుకొత్తూరు, అమలకుడియా తదితర ప్రాంతాల్లో బుధవారం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులను ప్రభుత్వ సంస్థలలో చేర్పించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో నూతన భవనాలను ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. సౌకర్యవంతమైన తరగతి గదులు, విశాలమైన క్రీడామైదానం, ఆంగ్ల మాధ్యమం విద్య, ఉచితంగా టాబ్స్, యూనిఫామ్, బెల్ట్, షూ, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బోధన అందించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే సాధ్యమని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఖాళీగా ఉండకుండా వివిధ నైపుణ్యాలు పెంపొందించడానికి చేస్తున్న సాధనను తనిఖీ చేసి, తల్లిదండ్రులకు తగు సూచనలు అందించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, జనార్ధనరావు, శివప్రసాద్, కిషోర్, చిన్నారావు, రామన్నాయుడు, విష్ణు ఆచారి పాల్గొన్నారు.

పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్న వైకుంఠరావు

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

రైతులకు అన్ని కాలాలూ పుష్కలంగా ఎరువులు కొరత లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఎరువులను పంపిణీ చేస్తుందని జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు అన్నారు. బూర్జ ఆర్‌బికెలో సర్పంచ్ అనురాధ అధ్యక్షతన రానున్న ఖరీఫ్ పంట కాలానికి ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి సాయం, క్రాఫ్ట్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ వంటి పథకాలతో ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుల ఆదుకుంటుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఏ రోజు రైతు పక్షాన ఆలోచించే దాఖలాలు లేవని అన్నారు. ఎఒ రాజేశ్వరరావు మాట్లాడుతూ సబ్సిడీపై యూరియా, డిఎపి అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కర్నేన నాగేశ్వరరావు, రైతులు అల్లు రామ్మూర్తి, పాలకొండ ఎర్రన్న, కృష్ణమూర్తి, వ్యవసాయ సహాయకులు కింజరాపు వసంత పాల్గన్నారు.

ఎరువులు, మందులను పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి రామారావు

సంక్షిప్త వార్తలు

'ఉపాధి' పనులు పరిశీలన

మెళియాపుట్టి : ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని సిరియాకండి, సుందరాడ గ్రామాల్లో చెరువు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించుకోవడంతో పాటు స్థానికంగానే వారికి ఉపాధి చూపించడం ద్వారా వలసలు నివారించాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. చల్లని సమయాల్లో రెండు పూటలూ పనిచేసి కనీస వేతనం పొందాలన్నారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇసి ఆదినారాయణరెడ్డి, ఎఫ్ఎ విజయ్ పండి పాల్గొన్నారు.

నిమ్మతొర్లాడలో జీవామృతం తయారీ

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులు 800 లీటర్ల జీవామృతాన్ని మండల యాంకర్ నక్క చిరంజీవిరావు బుధవారం తయారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి పంటల్లో జీవామృతాన్ని ఉపయోగించేలా చేస్తున్నామని తెలిపారు. చెరుకు పంటల్లో తరచూ క్రమం తప్పకుండా వారం రోజులకు ఒకసారి జీవామృతాన్ని విడిచి పెట్టేలా చేస్తున్నామని తెలియజేశారు. ఈ విధంగా చేయడం వల్ల భూమి సారవంతంగా మారడంతో పాటు నేల గుల్లబారుతుందని తెలిపారు. దీనివల్ల పంటల్లో అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేశ్వరరావు, తిరుపతి, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

కోటబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కోటబొమ్మాళి : మండలంలోని సరియాబొడ్డపాడుకు చెందిన కాశి మురళికి వెన్ను ఎముకలో కణితి ఏర్పడటం వల్ల తన రెండు కాళ్లు కనీసం కదపలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకొని వైద్య ఖర్చుల కోసం మండలం కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అతనికి రూ.10 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. మురళి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని కుటుంబ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ కొత్తపేట అధ్యక్షులు కంబాల అప్పల రాజు, ముకుందరావు, రాకేష్, జీరు రామకృష్ణ, దాసరి కిట్టు, రెడ్డి సిమ్మన్న పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోటకు చెందిన సీతారామ మ్యూజికల్ బ్యాండ్ పార్టీ మాస్టర్ రాజుకు అదే గ్రామానికి చెందిన సనపల లక్ష్మునాయుడు యువసేన తరపున ఆర్థికసహాయాన్ని అందజేశారు. రాజు మాస్టర్ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై సమస్యలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్.ఎల్.నాయుడు యువసేన సభ్యులు ఆయనకు రూ.31,500 ఆర్థికసాయం అందించారు.

'వెలమల'కు ప్రాధాన్యం

కోటబొమ్మాళి: వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వెలమలకు ప్రాధాన్యత ఇస్తున్నారని మండల విప్ బొడ్డు అప్పన్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వెలమకులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇటీవల ఊడికలపాడులో సమావేశం పెట్టారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజంలేదని స్పష్టం చేశారు. టిడిపి నాయకులే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని అన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

భవన నిర్మాణానికి శంకుస్థాపన

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియం భవన నిర్మాణ పనులకు సర్పంచ్ కాళ్ల సంజీవరావు బుధవారం శంకుస్థాపన చేశారు. మండల అంబేద్కర్ సేవాసమితి అధ్యక్షుడు బోకర జడ్డెన్న, ప్రధాన కార్యదర్శి దువ్వారపు సింహాచలం ఆధ్వర్యాన ఈ ఆడిటోరియంను నిర్మిస్తున్నామని అన్నారు. దాతలు, అంబేద్కర్ అభిమానులు ముందుకొచ్చి ఆర్థికసాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు దేవాది కృష్ణారావు, కూన మల్లయ్య, సురేష్, సిమ్మన్న, కాల ఆదినారాయణ, సామ సంజీవరావు, కర్జాన భాస్కరరావు, దేవాది రామారావు, ఎ.మహేష్, యస్వంత్ పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళిలో కాళింగ వీధి బోరు, కుళాయి నీళ్ల వచ్చే పైపు మరమ్మతులకు గురైంది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి మరమ్మతులు చేసి తాగునీరు అందించారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించినందుకు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు కళింగపట్నం అప్పారావు, కార్యదర్శి ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వీరాస్వామి

ప్రజాశక్తి- పలాస

కార్మిక హక్కుల సాధనకు పోరాటాల సరైన మార్గమని, కార్మిక హక్కుల కోసం పోరాడాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టు) జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని నీలావతిలో ప్రపంచ శ్రామిక కార్మిక ఉత్సవాలు సందర్భంగా బుధవారం కార్మికవర్గ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస హక్కులకు నోచుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కుసుమ, హేమావతి పిడిఎస్యుయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్, జగన్, మాధవరావు, అప్పయ్య, పాపయ్య పాల్గొన్నారు.

అందుబాటులోకి 'ఇన్నోవా క్రిస్టా టాప్ గ్రేడ్స్' కారు

శ్రీకాకుళం : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్ఎక్స్, వీఎక్స్) అందుబాటులో ఉందనిటయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ వెల్లడించింది. నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న లీలాకృష్ణ టొయోటా షోరూంలో వర్చువల్ సమావేశం ద్వారా బుధవారం మాట్లాడారు. వాహనం మెరుగైన ఫ్రంట్ ఫేసిమా కలిగి ఉంటుంది. దీనిని కఠినమైన, దృఢమైన ప్రదర్శన కోసం నిర్దిష్టమైన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించామన్నారు. తద్వారా భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పొరేట్ అవసరాలు తీరుస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతన ఇన్నోవా క్రిస్టాను రూ.50 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చునని అన్నారు. నియోగదారులు డీలర్ ఔట్ లెట్లతో పాటుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని అన్నారు.

ఘనంగా ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- నరసన్నపేట

అఖిలభారత యువజన సమాఖ్య 64 ఆవిర్భావ దినోత్సవం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు బుధవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి మౌలిక వసతులు కల్పనకు ఎఐవైఎఫ్ రాజీ లేకుండా ఎప్పటికప్పుడు పోరాటం చేస్తుందని అన్నారు. 1959, మే 3న ఎఐవైఎఫ్ సంఘంగా నిలబడి భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు, చేగువేరా స్ఫూర్తితో 63 ఏళ్ల పూర్తి చేసుకుందని అన్నారు. మతోన్మాదానికి, కాషాయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ఎ.సాంబశివరాజు, ఎ.రాము, ఎ. విజయ్, బాలరాజు, మోహన్, భాస్కర్, అభి, సందీప్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు